www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 19 డిసెంబరు 2024
5
చిత్తూరు



జిల్లా పోలీసుకు ఎబిసిడి అవార్డు



డిజిపి చేతుల మీదుగా ఎబిసిడి అవార్డు స్వీకరిస్తున్న చిత్తూరు ఎస్పి మనికంఠ చందోలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా క్రైమ్ విభాగం పోలీసులు అవార్డు ఫర్ బెస్ట్ క్రైమ్ డైరెక్షన్(ఎబిసిడి) అవార్డును సొంతం చేసుకున్నారు. గుడిపాల మండలంలో జులై 7వ తేదీ చోటు చేసుకున్న ఏటీఎం దొంగతనం కేసులో కరుడుగట్టిన అంతర్ రాష్ట్ర నిందితుడిని అరెస్ట్ చేసినందుకు ప్రతిష్టాత్మక ఎబిసిడి అవార్డులో మొదటి స్థానం దక్కించు కుంది. ప్రతి 3 నెలలకు ఒకసారి ఎబిసిడి అవార్డు ప్రదానం చేస్తారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ నేర పరిశోధన చేసిన కేసులకు ఎబిసిడి అవార్డును ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జులై ఏడవ తేదీ గుడిపాలలో చోటుచేసుకున్న ఎటిఎం దొంగతనం కేసును అత్యంత త్వరిత గతిన పరిష్కరించి చాకచక్యంగా నిందితుడిని అరెస్ట్ చేయడంలో సాహసోపేతమైన నైపుణ్యం చూపిన చిత్తూరు సబ్ డివిజన్, వెస్ట్ సర్కిల్ పోలీసుల కృషిని గౌరవిస్తూ, మొదటి బహుమతి (లక్ష రూపాయలు) ప్రదానం చేశారు. అవార్డును విజయవాడలోని డిజిపి కార్యాలయంలో నిర్వహించిన ఎబిసిడి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు చేతుల మీదుగా అడిషనల్ డిజిపి (సిఐడి) రవిశంకర్ , లా అండ్ ఆర్డర్ ఐజి శ్రీకాంత్ సమక్షంలో చిత్తూరు ఎస్పి మణికంఠ చందోలు, వెస్ట్ సర్కిల్ సిఐ రవిశంకర్ రెడ్డి, టెక్నికల్ టీం సభ్యులు దేవరాజులు, గోపి, నవీన్ అవార్డును అందుకున్నారు. గుడిపాలలో చోటు చేసుకున్న ఏటీఎం చోరీ కేసులో కీలక ఆధారాలను తక్కువ సమయంలో సేకరించి, అంతర్ రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేయడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించిన చిత్తూరు జిల్లా పోలీసులను డిజిపి అభినందించారు.

చిత్తూరు వాసుల స్వప్నం నెరవేరేనా?

- అభివృద్ధికి ముందడుగు
- హైరోడ్డు విస్తరణ
- యూనివర్సిటీ ఏర్పాటుకు యత్నం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లాలో అభివృద్ధికి నోచుకోని చిత్తూరు పేరుకే జిల్లా కేంద్రంగా మిగిలి పోయింది. నిత్యం తాగునీటి సమస్య, విద్య, వైద్యం వెనుకబాటు, నామమాత్ర ఉపాధి అవకాశాలు, సహకార విజయ డెయిరీ, సహకార షుగర్, న్యూట్రిన్ ఫ్యాక్టరీ మూసివేత సమస్యలతో సతమతమవుతోంది.. రెండు లక్షలా 16వేలు మంది జనాభా వున్నా చిత్తూరును అన్నీ సమస్యలే వెంటాడుతున్నాయి. పార్టీలు మారినా, పాలకులు మారినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా చిత్తూరు నగర పాలక సంస్థ ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు.

1911 ఏప్రిల్ , 1వ తేది చిత్తూరు జిల్లా చిత్తూరు జిల్లా కేంద్రంగా ఏర్పడింది. చిత్తూరు మున్సిపాల్టీ అయిన తర్వాత 2012లో 14 పంచాయతీలను కలుపుకొని రెండు లక్షల మంది జనాభాతో 50 డివిజన్లతో నగర పాలక సంస్థను ఏర్పాటు చేశారు. 2014లో నగర పాలక సంస్థ ఏర్పాటైంది. మొదటిసారి ఎన్నికలు నిర్వహించారు. టిడిపి నుండి నగర మేయర్‌గా కఠారి అనురాధ ఎన్నికయ్యారు. రెండో సారి నగర పాలక ఎన్నికల్లో మేయర్‌గా వైసిపి అభ్యర్థి అముద ఎన్నికయ్యారు. నగర పాలక సంస్థగా ఏర్పడి 11 సంవత్సరాలు అవుతున్నా నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు శాశ్వత తాగునీరు, డ్రైనేజి, ఇరుకైన రోడ్లుతో ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా కట్టమంచి నుండి రెడ్డిగుంట వరకు వేలూరు జాతీయ రహదారి, తానా చెక్‌పోస్టు నుండి ఇరువారం వరకు రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. తుపాను, వరద సమయాల్లో నీవానది పరిసర ప్రాంతాల ప్రజలు వర్షపు నీరు వరదగా మారి ఎప్పుడు ఇళ్లను ముంచేస్తుందో అంటూ బిక్కుబిక్కుమంటూ గడపుతున్న పరిస్థితి ఏర్పడింది.

చిరకాల స్వప్నం నెరవేరేనా?

యువ నాయకుడు, చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగనమోహన్ చిత్తూరు నుండి ఎంఎల్ఏగా విజయం సాధించిన తర్వాత చిత్తూరు అబివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే చిత్తూరు గళం వినిపించి చిత్తూరుకు ప్రత్యేక యూనిర్సిటీ ఏర్పాటు, అడవిపల్లి రిజర్వాయర్‌కు నీటి కేటాయింపులు, ఎన్‌టిఆర్ జలాశాయనికి నీటి తరలింపు, నీవానదికి ఇరువైపులా



హైరోడ్డు విస్తరణ కోసం ఆక్రమణలు తొలగిస్తున్న నగర పాలక సిబ్బంది

కాంక్రీట్ వాల్ నిర్మాణం, యువత ఉపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు విస్తరిస్తేనే పరిశ్రమలు వస్తాయంటూ హైరోడ్డు విస్తరణకు ముందడుగు వేశారు. ఇందు కోసం నాగయ్య కళాక్షేత్రంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించి ఆమోదం తీసుకున్నారు. భవన యజమానులతో చర్చించి ఒప్పించి ముందుకు సాగుతున్నారు. నగర అభివృద్ధి కోసం ఎంఎల్ఏ చేస్తున్న కృషిని నగరవాసులు అభినందిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరు వాసులు చిరకాల స్వప్నం నెరవేరేనా? అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

మురికి వాడల్లో మౌలిక వసతులు కల్పించాలి

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో 14 విలీన పంచాయతీలు 30 కి పైగా మురికివాడలున్నాయి. విలీన పంచాయతీల్లో పన్నుల వసూలు చేస్తున్నా ఏమాత్రం మౌలిక వసతులు కల్పించడం లేదు. మురికి వాడల్లో కనీస వసతులు తాగునీటి కోసం ఇబ్బందులు, అస్తవ్యస్తమైన డ్రైనేజి, మినుకుమినుకు మనే వీధిలైట్ల మధ్య గడుపుతున్నారు. అభివృద్ధి అంటే మురికివాడల్లోనూ మౌలిక వసతులు కల్పించాలని పేదలు కోరుతున్నారు. ప్రజా సమస్యలపై ప్రజాపోరు సందర్భంగా సిపిఎం బృందం నగరంలోని అనేక మురికి వాడల్లో పర్యటించి సమస్యలు గుర్తించింది. ప్రధానంగా నీవానది ముప్పు నుండి ప్రజలను కాపాడాలి.. అండర్ డ్రైనేజి వ్యవస్థ, డంపింగ్ యార్డు మార్పు, ఇళు లేని పేదలకు ఇళ్లు వంటి సమస్యలు పరిష్కరించడంతో పాటు రోడ్లు విస్తర్ణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న భవన యజమానులకు చట్టపరంగా నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.



నగర అభివృద్ధిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్(ఫైల్ ఫొటో)



నీవా నదిని పరిశీలిస్తున్న సిపిఎం బృందం (ఫైల్‌ఫోటో)

త్వరిత గతిన పనులు పూర్తి చేయాలి

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఆదేశం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : గ్రామాలలో ఉపాధి హామీ కింద 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపిడిఓ లను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో కలెక్టర్ పారిశుద్ధ్యం, హౌసింగ్, ఎంజిఎన్ ఆర్ ఈజిఎస్, తాగునీరు సంబంధిత అంశాలపై ఎంపిడిఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఈఈలు, డిఈలు, ఏఈ లతో చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి నియోజకవర్గాల వారీగా విడివిడిగా సంబంధిత అధికారులతో జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులుతో కలిసి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాలలో తాగు నీటి సరఫరా, డ్రైనేజ్‌ల నిర్మాణం ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించేందుకు ఎంపిడిఓలు చొరవ చూపాలని రూ.5 లక్షల లోపు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, రూ.5 లక్షలపై బడిన పనులకు సంబంధించి మార్చి 31వ తేదీ లోపు గడువు ముగుస్తుందనే అంశాన్ని సంబంధిత ఎంఎల్‌ఏలు, ఎంఎల్ సిలు, ఎంపిపి, జెడ్పిటిసిలకు సమాచారం అందించాలన్నారు. ఈ విషయంలో గ్రామాల అభివృద్ధి కి నిధులు వినియోగించకుంటే ఎంపిడిఓలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా ప్రధాన అంశాలని, వీటి పై ఏ సమస్యలు రాకుండా పని చేయాలని ఆదేశించారు. కలుషిత నీటిని ప్రజలు తాగడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులకు ఎవరు బాధ్యత వహిస్తారని, పంచాయతీ సెక్రటరీలు శుభ్రం చేశారనే విషయానికి సంబంధించి రుజువు ఉండాలని, ఇందుకు సంబంధించి ప్రతి మండలంలో రికార్డులను నిర్వహిస్తున్నారా ? ఎంపిడివో లు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నారా? లేదా అని కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కు సురక్షిత మంచి నీటిని సరఫరా చేయడం పంచాయతీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల విధిగా నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను నెల రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, అందుకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించా లన్నారు. ప్రతి మాసానికి మండలంలోని అన్ని ట్యాంకులను శుభ్రం చేసినట్లు ఎంపిడిఓలు ధృవీకరిం చాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో జ్వరాలకు సంబంధించి కేసుల నమోదు సంబంధిత విషయాలపై ఎంపిడిఓలు సమన్వయం చేసుకుని ఆయా గ్రామాలలో వెంటనే పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టేలా పని చేయాలన్నారు. ఈ సమా వేశం లో జెడ్‌పి సిఈఓ రవికుమార్ నాయుడు, హౌసింగ్, డ్వామా పీడీలు పద్మనాభం, రవి కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏఆర్ డిఎస్‌పిగా చిన్నికృష్ణ



ఎఆర్ డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన చిన్నికృష్ణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన డిఎస్‌పిల సాధారణ బదిలీలో భాగంగా అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తూ చిత్తూరు జిల్లా ఏఆర్‌కు డిఎస్‌పిగా బదిలీపై వచ్చి బుధవారం ఉదయం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1991 లో ఆర్ఎస్ఐగా విధుల్లో చేరి 2001 లో ఆర్ఐగా ప్రమోషన్ పొంది చిత్తూరులో ఆర్ఐ అడ్మిన్‌గా విధులు నిర్వహించి గ్రే హౌండ్స్‌కు బదిలీపై వెళ్లి 2004లో నిర్వహించిన ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచినందుకు ప్రసిడెంట్ అవార్డును పొందారు. 2012 లో డిఎస్‌పిగా ప్రమోషన్ పొంది కడప, గుంటూరు, పల్నాడు లో విధులు నిర్వహించి అన్నమయ్య జిల్లా నుండి చిత్తూరుకు బదిలీపై వచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం!

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఎస్ఆర్ పురం మండలం బసవరెడ్డి పల్లి గ్రామం చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారి పక్కన కొయ్యవరిండ్లు దగ్గర ఉష ఇంటి వద్ద విద్యుత్ శాఖ వారు గృహ వినియోగం కోసం గతంలో విద్యుత్ శాఖ విద్యుత్ శాఖ వారు ట్రాన్సుఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇంటికి ఆనుకొనే ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వుంది. భూమి నుంచి విద్యుత్ ట్రాన్సుఫార్మర్‌పై విద్యుత్ తీగల చుట్టూ దట్టంగా వివిధ చెట్ల తీగలు అల్లుకు న్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎవరైనా అటువైపు వెళితే విద్యుత్ షాక్‌కు గురి అయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు . విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి వీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలు

అత్యాచారం కేసు నిందితుడి అరెస్టు



ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధించి, మాయ మాటలు చెప్పి తీసుకెళ్లి బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డ రుకేష్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చిత్తూరు డిఎస్‌పి ఆదేశాల మేరకు కల్లూరు ఎస్ఐ యు వెంకటేశ్వరు, సిబ్బంది గాలించి తప్పించుకు తిరుగుతున్న నిందితుడు రుకేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

వసతి గృహాల మరమ్మతులకు.. రూ. 8 కోట్ల నిధులు కేటాయింపు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతుకు మునుపెన్నడూ లేని విధంగా రూ.8 కోట్లు నిధులు కేటాయించారని ఈ నిధులను పారదర్శకంగా సద్వినియోగం చేసి వసతి గృహ మరమ్మతులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు సంబంధించి సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులైన పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి, ఆర్ డబ్ల్యు ఎస్, సమగ్ర శిక్ష అధికారులతో సమీక్ష బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..చిత్తూరు జిల్లాకు సంబంధించి 48 వసతి గృహాలకు 8 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. వసతి గృహాల నిర్మాణంలో పి ఆర్, ఆర్ డబ్ల్యూ ఎస్, ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులను ప్రత్యేక శ్రద్ధ పెట్టి వసతి గృహాల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. నాణ్యతలో రాజీలేదని జనవరి 10వ తేదీ లోపు మరమ్మతులకు సంబంధించిన టెండర్ ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, పిఆర్‌ఎస్‌సి చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటరమణారెడ్డి సంబంధిత ఏ ఎస్ డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

21న భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్‌సర్సన్ నారా భువనేశ్వరి ఈనెల 21వ తేదీ రామకుప్పం మండలంలో పర్యటిం చనున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తెలిపారు. బుధవారం మండలం లోని గాంధీ నగర్‌లో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలతో పర్యట న ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. నాలుగు రోజుల నియోజకవర్గ పర్యటనలో భాగంగా 21వ తేదీ ఆదివారం ఉదయం పిఇఎస్ కళాశాల గెస్ట్ హౌస్ నుంచి గాంధీ నగర్‌కు చేరుకుంటారన్నారు. గ్రామంలో మహిళలతో ముఖాముఖి ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పాలనలో జరిగిన సంక్షేమాల అభివృద్ధిని వివరిస్తూ, మహిళల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించనున్నారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం శాంతిపురం మండలం లోని నందిగాం కళ్యాణ మండపానికి చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కూటమి నేతలు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీరాములు రెడ్డి, సుబ్రీ, రఫీ,వెంకటరమణ, బాలరాజు, భాను, జయరాం పాల్గొన్నారు.



పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న రామకుప్పం టిడిపి నాయకులు



భూములు పరిశీలిస్తున్న జెసి విద్యాధరి

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఫారెస్ట్ రెవెన్యూ భూముల సందర్శనలో జెసి విద్యాధరి

ప్రజాశక్తి-చౌడేపల్లి: గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలుల రూపొందిస్తామని జెసి విద్యాధరి పేర్కొన్నారు. మండలంలోని అట వీ, రెవెన్యూ భూములను జాయింట్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. మండలంలోని దిగువపల్లి పంచా యతీ మోట్లపల్లి అటవీ భూముల వద్ద రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు సమస్యపై జాయింట్ కలెక్టర్ విద్యాధరి డిఎఫ్ఓ భరణి సంయుక్తంగా అటవీ, రెవెన్యూ భూమి సరిహద్దులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే జయరాజ్ , డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్లు గుణశేఖర్, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీరాములు, సర్వేయర్లు నీలిమ, మురళి, ఉస్మాన్, ఘనీ, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి బీమా గడువు పెంపు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : జిల్లాలో మామిడి పంటకు ప్రభుత్వం వైపు నుంచి నిర్ణయించిన ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి రైతులకు డిసెంబర్ 31, 2024 వరకు గడువును పొడిగించారని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి రైతులు పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలనుకున్న వారు ఎకరాకు 1,750 రూపాయల చొప్పున ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులో లేదా నేరుగా మీ సేవ సెంటర్లలో, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీకి సంబంధించిన క్లస్టర్ ఇన్‌ఛార్జీల ద్వారా, లేదా నేరుగా నేషనల్ క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ పోర్టల్ లో చెల్లించి బీమాకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిసెంబర్ 15వ తేదీ వరకు ఉన్న గడువుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిసెంబర్ 18 వ తేదీ నుంచి డిసెంబర్ 31 వ తేదీ వరకు పొడిగించిందన్నారు. 1,750 రూపాయలు ప్రీమియం మొత్తం చెల్లిస్తే వాతావరణంలో ఎదురయ్యే మార్పులు, అనుసరించి గాలిలో తేమశాతం, అధిక వర్షపాతం, ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు, పంట కాలంలో గాలి వేగం కారణాలను పరిశీలించి ఎకరాకు 35 వేల రూపాయల వరకు ఇన్సూరెన్స్ పొందే అవకాశం ఉంటుందని, ఐదు సంవత్సరాలు పైబడిన తోటలన్నింటికీ విస్తీర్ణంతో సంబంధం లేకుండా, అన్ని వర్గాల రైతులు ఇన్సూరెన్స్ చేసుకోవడానికి అర్హత ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని మామిడి రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి తెలిపారు.

ధాన్యం ధ్వంసం!

- ఏనుగుల స్వైర విహారం
- రూ.50 వేలు నష్టం
- ఆదుకోవాలని రైతు వేడుకోలు

ప్రజాశక్తి -సోమల: రైతులు తాము ఒబ్బిడి చేసేందుకు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగుల స్వైర విహారంలో 20 బస్తాల ధాన్యాన్ని తిని, 15 బస్తాలను తొక్కి ధ్వంసం చేశాయని తమకు 50వేల నష్టం కల్గించాయని ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. బాధిత రైతు కథనం మేరకు.. సోమల పంచాయతీ నెరుకూరి వారి పల్లె గ్రామానికి చెందిన హరి అనే రైతుకు చెందిన వరి పంట నూర్పిడి చేసి ఎండకు ఆరబెట్టేందుకు బండపై ఒబ్బిడి చేసిన 20 మూటల వడ్లు జంట ఏనుగులు తిని 15 మూటల వడ్లు బండ మొత్తం చిందర వందర చేసినట్లు రైతు తెలిపారు. నాలుగు రోజుల క్రితం తాను పండించిన పొలంలోని వరి ధాన్యం పంట కోసి తడి ఆరబెట్టేందుకు బండపై చేర్చాడు. మంగళవారం రాత్రి వడ్లు మొత్తం కుప్పగా పోసి పట్టలు కప్పి ధాన్యం వద్దే రాత్రి కాపలా కాశానని తెలిపాడు. బుధవారం ఉదయం సరిగ్గా 2 గంటల ప్రాంతంలో ఏనుగులు వస్తున్న అలికిడి విని తాను సురక్షిత ప్రాంతానికి చేరుకున్నానని ఆ తరువాత ఉదయం వెళ్లి చూడగా బండపై కుప్పగా పోసిన వడ్లు చిందరవందర చేయడం 20 మూటల వడ్లు తినేసి మిగిలిన 15 మూటలకు పైగా వడ్లు బండపై మొత్తం చిందరవందర చేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. వడ్లు కుప్పపై పరచిన పట్టలను కూడా చించివేశాయని దాదాపు 50 వేల రూపాయల నష్టం కలిగిందని వాపోయాడు. ఆరు నెలల క్రితం తాను ఎకరం పొలంలో వరి పైరు నాటి కోతలు వచ్చే సమయానికి పంట మొత్తం ఏనుగులు ధ్వంసం చేయడంతో రెండు మూటలు మాత్రమే ఇంటికి చేర్చుకున్నానని తెలిపాడు. ఇలా పంటలు వేసిన ప్రతిసారి ఇంటికి ధాన్యం చేరే సమయానికి ఏనుగులు వచ్చి ధ్వంసం చేస్తున్నాయని అటవీ శాఖ వారికి సమాచారం ఇచ్చినా ఇంతవరకు స్పందన లేదని రైతు ఆవేదనతో తెలిపారు. వేల రూపాయల పెట్టుబడి పెట్టి యంత్రాల సాయంతో సేద్యం చేసి కూలీలతో పంట కోసి తీరా ధాన్యాన్ని ఇంటికి చేర్చుకునే సమయానికి ఇలా జరగడం తనకు ఎంతో ఆవేదన కలిగిస్తోందని, అటు ఆర్థిక నష్టం, ఇటు పంట నష్టంతో తాను నలిగిపోతున్నానని తనలాగే ఈ ప్రాంతంలోని ఇతర రైతులు కూడా ఏనుగుల దాడుల వల్ల పంటలు కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారని వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి ఏనుగుల బారీ నుండి రైతులను రక్షించాలని హరి అభ్యర్థించాడు.



నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్న రైతు హరి



జంట ఏనుగులు ధ్వంసం చేసి వరి ధాన్యం

ఘోర రోడ్డు ప్రమాదం

- కర్ణాటక సరిహద్దులో స్కూటర్లను ఢీకొన్న వాహనం
- ఐదుగురు కూలీలు దుర్మరణం

ప్రజాశక్తి -పుంగనూరు: కర్ణాటక రాష్ట్రం మూలబాగలు తాలూకా గుడిపల్లి పంచాయతీ సమీపం రాష్ట్ర సరిహద్దులో వున్న రామసముద్రం మండలం కూరిజిల గ్రామం వద్ద ఐదుగురు కూలీలు బొలెరో వాహనం ఢీకొని దుర్మరణం చెందారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మృతులు గుడిపల్లి పంచాయతీ నాగేపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు అప్పయ్య (45) గాయత్రి (40), కోనంగుంట గ్రామానికి చెందిన భార్యాభర్తలు వెంకటరమణప్ప(43), అలివేలమ్మ (38), అదే గ్రామానికి చెందిన రాధప్ప (45) సంఘటన ప్రదేశంలోనే మృతి చెందారు. వీళ్లు పని నిమిత్తం వెంకట రమణప్ప, అలివేలమ్మ, రాధప్ప ఒక బైకుపై, అప్పయ్య, గాయత్రమ్మ మరో బైకు పై ముల్‌బాగల్ వైపు వెళుతుండగా వడ్డి పల్లె నుంచి టమోటా బాక్సులతో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతివేగంతో రెండు బైకులను ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది.



కూలీలను ఢీకొన్న వాహనం



మృతి చెందిన కూలీ

కానరాని పారిశుద్ధ్యం

- పేరుకుపోయిన చెత్తకుప్పలు, ముళ్లకంపలు
- దోమలు, విష సర్పాలకు నిలయం
- ఇదీ దొడ్డిపల్లి దుస్థితి

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: చిత్తూరు నగర పరిధిలోని దొడ్డిపల్లిలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ఎటు చూసినా చెత్తకుప్పలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరగడంతో అపరిశుభ్రత నెలకొంది. పరిసరాలు దోమలు, విష సర్పాలకు నిలయంగా మారాయి. ఈ కారణంగా రాత్రి వేళ్లలో ఆ దారిలో వెళ్లాలంటే భయాందోళనకు గురికావాల్సి వస్తోందని దొడ్డిపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు దొడ్డిపల్లిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. వారాల తరబడి శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దొడ్డిపల్లి ప్రాంతం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. డ్రైనేజీలు సైతం నెలలు గడుస్తున్నా శుభ్రపరచకపోవడంతో కంపు కొడుతున్నాయి. డ్రైనేజీలు కనబడకుండా పిచ్చి మొక్కలు, ముళ్లకంపలు ఏపుగా పెరిగి దోమలకు, పాములకు, విష పురుగులకు నిలయంగా మారింది. రాత్రి వేళల్లో ఇళ్ల నుండి బయటకు రావాలంటే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల వద్ద కూడా ఇదే దుస్థితి ఏర్పడింది. దొడ్డిపల్లి ప్రాంతం మొత్తం దోమలు స్వైర విహారం చేస్తూ జ్వరాలు, వివిధ వ్యాధులకు కారణంగా మారుతోంది. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తకుప్పలు

క్రైం న్యూస్

దొంగ అరెస్ట్

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : పెట్రోల్ బంక్‌లో చోరీకి పాల్పడ్డ దొంగను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలంలో 2024 జనవరి రెండవ తేదీ రాత్రి ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో ప్రవేశించి లాకర్‌ను పగలగొట్టి అందులో ఉన్న రెండు లక్షల నలభై వేల రూపాయల డబ్బును దొంగలించుకుని పారిపోయారు. ఈ విషయంపై ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. పోలీసులు దర్యాప్తులో భాగంగా ప్రకాశం జిల్లా పొదిలి గ్రామానికి చెందిన వెంకట్రావు(40) ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఇతనిపై గతంలో 12 కేసులు వివిధ పోలీస్ స్టేషన్ల నమోదయినట్లు ఎస్ఐ తెలిపారు.


కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ ప్రసాదరావు

కేంద్ర మంత్రికి ఎంపీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు, టిడిపి ఎంపీలతో కలిసి రామ్మోహన్ నాయుడుకి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపా రు. ఆయన ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఇలాంటి పుట్టిన రోజు వేడుకలను మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. రామ్మోహన్ నాయుడు తండ్రి కె ఎర్రన్నాయుడు ఆశయానికి అనుగుణంగా పనిచేస్తూ ఆధునిక యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు.

ప్రత్యేక శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి అర్హులైన వారు హాజరయ్యారు. మఈ ఉచిత శిబిరంలో ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు అవసరమయ్యే పరికరాల గుర్తింపు కోసం పేర్లు నమోదు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అర్హులైన తమ ధ్రువీకరణ పత్రాలను తెచ్చుకుని వాళ్ల పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, చిత్తూరు గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, తహశీల్దారు లోకనాథ పిళ్లై, ఎంపీడీవో మోహన్ మురళి, ఏపీవో చంద్రశేఖర్, ఏపిఎం రోజా, ఈఓపిఆర్‌డి కోదండరామిరెడ్డి, ఆరు మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జానపద గాయని సుమతికి సత్కారం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లిపల్లె సచివాలయంలో ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్న సుమతి సిపిఐ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో పాల్గొని తృతీయ స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చేతుల మీదుగా 5 వేల రూపాయల నగదు బహుమతి ప్రత్యేక ప్రశంసా పత్రం షీల్డ్ ను సుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా సుమతిని సచివాలయ సిబ్బంది అభినందించారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని ముని నారాయణ కాలేజ్ లో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు కళాశాల యాజమాన్యం బుధవారం తల్లిండ్రుల సమావేశం నిర్వహించారు. కళాశాల యాజమాన్యం వి మహేష్ నూతన టెక్నాలజీని పరిచయం చేశారు. ప్రోగ్రెస్ కార్డులు తయారీలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడంలో నెంబర్-1.- ఏ ఒక్క ఇతర కళాశాలలో లేని విధంగా 50 నుంచి 60 సి ఏ టి పరీక్షల మార్కులను ఒకే ప్రోగ్రెస్ కార్డులో కేంద్రీకరించడం మునినారాయణకు మాత్రమే సాధ్యమని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. తల్లిదండ్రులకు అర్థమయ్యేలా, విద్యార్థుల హాజరు శాతాన్ని పై చార్ట్ రూపంలో తెలపడం అపురూపం అన్నారు. 97 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు మీటింగుకు హాజరు కావడం, హర్షించ దగ్గ విషయమని కళాశాల బృందం హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మహేష్, సిఇఒ సుమంత్ పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు స్మార్ట్ స్కిల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు బుధవారం సింక్రోలి పాలిట్రిజియన్స్ శిక్షకులు రవిశంకర్ స్మార్ట్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు వృత్తి విద్యతో పాటు కొన్ని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. కంప్యూటర్ వంటి రంగాల్లో స్వల్ప కాలిక కోర్సులతో మెరుగైన ఉపాధి పొందవ చ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం: ఎంపీడీవో

ప్రజాశక్తి -విజయపురం: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర అని ఎంపీడీవో రమణప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. అనంతరం ఈవోపీఆర్డీ రాజేంద్ర సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజేంద్రన్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణి:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీలో అభివృద్ధి సాధనకు కృషి చేయడానికి తీసుకోవలసిన చర్యలపై ఈవోపీఆర్డీ శారదా దేవి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏ.ఈ శ్రీనివాసులు,ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద, ఏపిఎం మీరాబాయి,సిహెచ్ఓ కరుణాకర్, సర్పంచులు,కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం: టిడిపి

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వ నమోదు నిరంతరాయంగా కొనసాగుతోంది. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే లక్ష మందికి పైగా సభ్యత్వం తీసుకున్నారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ ఆధ్వర్యంలో కొత్తపేట ఇన్‌ఛార్జి ముఖేష్ అప్పు సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, షాది మహల్ మాజీ అధ్యక్షులు అన్సర్ భాష, సత్యరాజ్ పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:ప్రతి పీహెచ్ సి నందు టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ ను అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాసచివాలయం లోని వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లా లో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కింద గర్భిణీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. వ్యాధినిరోధక టీకాలు పిల్లలందరికీ 100% తప్పక వేయాలనన్నారు.

జెడ్‌పీ సీఈఓకు సన్మానం


జెడ్‌పీ సీఈఓను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈఓ ను వెదురుకుప్పం మండల టిడిపి నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. టిడిపి నాయకులు రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ముని చంద్రారెడ్డి, జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి, టిడిపి మండల మాజీ అధ్యక్షులు మోహన్, మురళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. గతంలో ఈయన వెదురుకుప్పం ఎంపీడీవోగా మండల వాసులకు సేవలు అందించారు. అందరికీ సుపరిచితులు. మండల అభివృద్ధి పరిస్థితులు అడిగి తెలుసుకున్నట్లు టిడిపి నాయకులు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు గాలి బాబునాయుడు, నియోజకవర్గ బిసిసెల్ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెంగల పండురెడ్డి, బూత్ కమిటీ ఇన్‌చార్జ్ శంకర్, బిల్లర్ సుపాల్ రెడ్డి, మండల యువ నాయకుడు గజేంద్రరెడ్డి, మండల బీసీ నాయకుడు జయచంద్ర, కార్యకర్తలు భద్రరాజు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టరు థామస్

ప్రజాశక్తి -కార్వేటినగరం : భూ సమస్యల సత్వర పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని జిడి నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సిడి కండ్రిగ సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, టిడిప నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : ఎస్ఆర్‌పురం మండలం శెట్టివానత్తం గ్రామం రెవెన్యూ సదస్సులో 1బీ రిజిస్టర్, 22(ఏ) జాబితాలను సదస్సులో అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ పేర్కొన్నారు. బుధవారం శెట్టివానత్తం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. స్థానిక రైతులు రెవెన్యూ సదస్సు లో పాల్గొని సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో టిడిపి మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, మండల తహశీల్దారు లోకనాథ పిళ్ళై , డిప్యూటీ తహశీల్దార్ రవీంద్రబాబు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని నెల్లిపట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తమశీల్దారు మాధవరాజు అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎనిమిది గ్రామాల ప్రజలు భూ సమస్యలపై అర్జీల రూపంలో వినతులు అందించారు. మొత్తం 72 అర్జీలు భూ సమస్యలపై వచ్చాయని వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, ఆర్ఐ సరిత, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల : రొంపిచర్ల మండలం చిచిలి వారిపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 20 అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు పి కిరణ్ కుమార్ తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలు భూములు ఆన్లైన్, రైతులు పొలం వెళ్ళుటకు దారి సమస్యలు, డీకేటి పట్టా భూములు మొదలైన భూ సమస్యలు అర్జీల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణం పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సుధాకర్ నాయక్, వీఆర్వో, నాయకులు మదన్ మోహన్ పాల్గొన్నారు.

విజయపురం: డికేటీ భూములు ముప్పై సంవత్సరాల అనుభవం ఉన్నా ఆన్లైన్లో తమ పేరు కనిపించడం లేదని మండలంలోని శ్రీహరిపురంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ కిరణ్ కు రైతులు మొర పెట్టుకున్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా రెండు తరాలు అనుభవిస్తున్న వారి భూములను గు ర్తించి ఆన్లైన్ చేయాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో డీటీ అశోక్, వీఆర్వో వెంకటేసులు, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్ రాజు, దశరథరాజు, సురేష్, జయరామరాజు, నరేష్, చెంచురాజు, చిన్నబ్బరాజు పాల్గొన్నారు.

విజయపురం నగరి : జాతీయ రహదారి అధికారులు ఇష్టారాజ్యంగా స్థలసేకరణ చేపడుతున్నారని దాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని నెత్తం కండ్రిగ గ్రామ ప్రజలు ఆర్డీవో భవానిశంకరికి బుధవారం వినతిపత్రం అందించారు. స్థల సేకరణలో వస్తున్న మార్పులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జాతీయ రహదారి కోసం ప్రభుత్వం అడిగిన వెంటనే ఇళ్ల స్థలాలను వదిలేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారి వారు ఆక్రమించిన స్థలం పోను మిగిలిన కొంత స్థలాల్లో తాము ఇల్లు నిర్మించుకున్నామన్నారు. ఇప్పుడు సర్వీసు రోడ్డు పేరిట మళ్లీ జాతీయ రహదారి వారు భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. పేదలు ఇల్లులు పోగొట్టుకుంటారన్నారు. పలువురు భయాందోళనకు గురవుతారన్నారు. ప్రస్తుత నివాసం ఉంటున్న ఇల్లులు మాత్రమే వారికి ఉన్నాయన్నారు. వాటిని కూడా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రెండవసారి తీసుకుంటే మేము ఎలా బతకాలి ఎక్కడ నివసించాలని ఆవేదనతో ఆర్డీవోకు మొరపెట్టుకున్నారు. ఈ ప్రాంతంలో స్కూలు చర్చి కూడా ఉన్నాయన్నారు. అధికారులు వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని మా ఇల్లులు మాకే దక్కే విధంగా చూడాలన్నారు. ఆర్డీవో వారికి సమాధానమిస్తూ అధికారులతో చర్చించి గ్రామ సభ నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, 9వ వార్డు కౌన్సిలర్ దేవరాజులు, బాధితులు కృష్ణమూర్తి, రామలింగం, లక్ష్మీపతి, సలీం, చంద్రశేఖర్, గంగాధరం, దేవరాజులు, వెంకటరమణ పాల్గొన్నారు.

శాంతిపురం : మండల పరిధిలోని గుంజార్లపల్లి గ్రామ సచివాలయంలో గుంజార్లపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన రైతులకు బుధవారం రెవెన్యూ సదస్సును గుంజార్లపల్లి సర్పంచ్ విజయరామరెడ్డి మండల తహశీల్దారు జి.శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు,మండల సర్వేయర్,వీఆర్వో,కంప్యూటర్ ఆపరేటర్ అనిల్,మండల టిడిపి నాయకులు ,పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


సాగునీటి సంఘాల చైర్మన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

సాగునీటి సంఘాల చైర్మన్లకు సన్మానం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : సాగునీటి సంఘాల నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఎస్ఆర్‌పురం మండల టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ బుధవారం సన్మా నించారు. ఎస్ఆర్‌పురం, పెనుమూ రు , జీడి నెల్లూరు మండలాల నీటి సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను సన్మానించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే రాజకీయాలకు వచ్చానని రిజర్వుడు నియోజకవర్గంలో దళితుల జీవితాల్లో వెలుగు నింపాలన్న ఉద్దేశంతోనే మండలానికి ఓ దళితవాడని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పురం మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, పెనుమూరు మండల అధ్యక్షులు రుద్రప్ప నాయుడు, గంగాధర నెల్లూరు స్వామి దాస్, మూడు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వారి అభ్యసనా సామర్థ్యాలు పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాలులో వన్ స్కూల్ అట్ ఎ టైమ్ ఒసాట్ వారితో ఎంఒయూ జిల్లా విద్యాశాఖ తరపున కలెక్టర్ సుమిత్ కుమార్, సంస్థ సి ఈ ఓ వెంగాలా భట్, ప్రాజెక్ట్ అడ్మిన్ కేదార్ శాస్త్రి తదితరులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. గ్రామీణ పాఠశాలల్లోని విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వారి అభ్యసనా సామర్థ్యాలు పెంపులో భాగంగా ఎంఒయు చేసుకున్నామన్నారు. చిత్తూరు జిల్లాలో ఎంపికైన 22 పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు విడివిడిగా శిక్షణ తరగతులను ఈ సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9 వతరగతి వరకు ఉన్న విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. సంస్థ చేపట్టనున్న కార్యక్రమాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ రెడ్డి, వన్ స్కూల్ అట్ ఎ టైమ్ (ఒసాట్) డైరెక్టర్ శృతి, జెటిడి ధనుంజయ్, ఎంఈఓలు పాల్గొన్నారు.

104 వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్


వైద్యసేవలు అందిస్తున్న 104 సిబ్బంది

ప్రజాశక్తి -యాదమరి: గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ప్రతి పంచాయతీలో నిర్వహిస్తున్న 104 సంచార వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపు నిచ్చారు. బుధవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వేపనపల్లిలో 104 ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతినెల మూడవ బుధవారం మీ గ్రామానికి 104తో పాటు వైద్యాధికారి వైద్య బృందం వచ్చి చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. చిన్న చిన్న జబ్బులకు ఇక్కడే వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు కూడా అందిస్తామన్నారు. సిహెచ్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 14 రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందిస్తామన్నారు. గర్భిణులు ప్రతి నెలా 104 వాహనం వద్దకు వచ్చి వైద్య పరీక్షలు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియ కుమారి, ఆశా కార్యకర్తలు రమ, భువనేశ్వరి రమీల 104 డీఈవో రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -పూతలపట్టు: పూతలపట్టు మండలం టి రంగంపేట క్రాస్‌లో సుచి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ డైరెక్టర్ పాల్ విజయ్ కుమార్, గ్లోరీ విజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులు, వితంతులకు దుస్తులు, చాప, చీరలు, దుప్పట్లు, టవల్, రొట్టెలు, అరటిపళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్లోరీ మాట్లాడుతూ గత 42 సంవత్సరాలుగా బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో సేవా కార్యక్ర మాలు అందించామన్నారు. ఇందులో భాగంగా బుధవారం 75 మంది వృద్ధులు, వితంతువులకు సహాయం చేశామన్నారు. గత కాలంలో గ్రామాలు అభివృద్ధిలో భాగంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పనికి ఆహార లబ్ధిదారులకు పనిముట్లు, గడ్డపార, పార, కత్తి పరికరాలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సుచి సిబ్బంది ఎంఎస్ మనీ, జాకప్ జాన్సన్, డి చిన్నయ్య, యోవాన్ సురేష్, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం: టిడిపి

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలకు విశేష స్పందన లభించిందని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వీర్నమల పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న భూమి సమస్యలు, దారి సమస్యలపై స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు వినతులు అందించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే తప్పిదాలను కూటమి ప్రభుత్వంలో పరిష్కరించేందుకు ప్రజల వద్దకే రెవెన్యూ సదస్సులతో పరిష్కారం లభిస్తుందన్నారు. త్వరిత గతిన రైతుల భూ సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులకు , పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి గ్రామాలు అభివృద్ధిని దృష్టిలో వుంచుకుని ఈ కార్యక్రమం ప్రారంభిం చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రవి, ఇన్‌ఛార్జి ఈఓపిఆర్డి గణపతి, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాంతిపురం : సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించి పేదరికం లేని సమాజాన్ని స్థాపిద్దామని శాంతిపురం ఎంపీడీవో కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కుమార్ ఆధ్వర్యంలో లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్మెంట్ ఏరియా పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివయ్య, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, పలువురు ముఖ్య అతిథులు,సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల: ఐరాల మండల ఆఫీసులో నిర్వహిస్తున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసినట్లు ఐరాల మండల విస్తరణాధికరి కుసుమ కుమారి తెలిపారు. క్షేత్రస్థాయి లోని పలు అంశాలపై , సాధించవలసిన లక్ష్యాల గురించి శిక్షణ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఎంపిడిఓ ధనలక్ష్మి, మండల అధికారులు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్‌డే

ప్రజాశక్తి -విజయపురం, నగరి : పట్టణ పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల్లోని విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో భవనం వద్దకు చేరుకున్నారు. యువకుల్లా సభాస్థలిని ముస్తాబు చేసుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయచంద్రుడు, కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం పెన్షనర్స్‌డే ప్రాముఖ్యతను తెలుపుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి.జయరామనాయుడు హాజరయ్యారు. అనంతరం సంఘానికి నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా ఎ.జయచంద్రుడు, గౌరవ అధ్యక్షులుగా ఓ. బాలసుబ్రమణ్యం, అసోసియేట్ అధ్యక్షులుగా ఎంఎ జయరామ్, టిఎస్ రామూర్తి రెడ్డి, కోశాధికారిగా కె.జయరామ్, ఉపాధ్యక్షులుగా శ్రీహరి, నీలకంఠారెడ్డి, మురళీధర్, కైలాసం, కార్యదర్శులుగా నారాయణరాజు, లక్ష్మీకాంతమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు చెంగారెడ్డి, పుత్తూరు శాఖ అధ్యక్షులు భాస్కర్‌రాజు, ఎస్టీవో చంద్రశేఖర్, బ్యాంక్‌మేనేజర్ రియాజ్‌బాబు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామచంద్రన్ పాల్గొన్నారు.

'పెండింగ్ జీతాలు చెల్లించాలి'

ప్రజాశక్తి- విజయపురం నగరి : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయమ్మలకు, వాచ్ మ్యాన్‌లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల జీతాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐటీయుసీ స్కూల్ ఆయమ్మల సంఘం తరపున ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయంలకు వినతిపత్రం అందించారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, స్కూల్ ఆయమ్మల సంఘం జిల్లా కార్యదర్శి జయకుమారి, మండల స్కూలు ఆయమ్మల వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీ, నాయకులు గీతా, కళా, సరస్వతి, తులసి, మంజుల, ఏఐటీయూసీ నాయకులు నాగభూషణం, మూర్తి, సదాశివం, సీతా, యమునా పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ జాతర

- భక్తులను ఆకట్టుకున్న వేషాలు


భక్తులను ఆకట్టుకుంటున్న వివిధ వేషధారణలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం సంస్థానాధీశులు కాలంనాటి నుండి ప్రతి ఏడాది గంగమ్మ జాతరను డిసెంబరులోని కార్తీక మాసంలో ఆనవాయితీ ప్రకారం నిర్వహిస్తారు. జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బుధవారం వేకువ జామున 1 గంటలకు బంగారమ్మ ఆలయం వద్ద నుండి నగరంలోని నాలుగు రాళ్లవరకు మేళతాళాలు, ప్రత్యేక వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మ వారికి మొక్కులు తీర్చుకొన్నారు. మహిళలు అమ్మవారి వెంట వేలాది సంఖ్యలో వెయ్యి కళ్లల దుత్తలను మోసి మొక్కులను తీర్చుకున్నారు. యువత ఆధ్వర్యంలో బండ వేషం, రాక్షసవేషం, గరగాటం, మహాశక్తి వేషాలతో పలువురుని ఆకట్టుకున్నారు. జాతరను తిలకించడానికి మండలం నుండే కాకుండా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జన సందోహంతో వీధులు కళకళలాడాయి. నడి వీధిలో కొలువుదీరిన గంగమ్మ, బంగారమ్మ వద్ద భక్తులు మొక్కులు సమర్పించు కున్నారు. సాయంత్రం అమ్మవారిని మేళ తాళాలతో, బాణా సంచాలు పేలుస్తూ నగరం సమీపంలోని కోట చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉపాధ్యాక్షుడు రంగనాథమొదలి, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, గ్రామస్తులు పాల్గొన్నారు. జాతరకు సంబరాల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజ్‌కుమార్, సుమన్, వంద మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కబ్జా భూమిని ఇప్పించండి

పోలీసులకు బాధితుడి వినతి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : తమకు సంబంధించిన భూమిని తమ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వెంటనే రక్షించి తమకు అప్పగించాలని ఓ బాధితుడు పోలీసులను బుధవారం ఆశ్రయించాడు. ఈ సందర్భంగా కుప్పం మండలం పైపాల్యం గ్రామానికి చెందిన కృష్ణప్ప మాట్లాడుతూ మండల పరిధిలోని చెక్కునత్తం గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 5 లో తన తండ్రి తీతప్ప 70 సెట్ల భూమిని కొనుగోలు చేశాడన్నారు. 50 సంవత్సరాలకు పైగా ఈ భూమి తన స్వాధీన అనుభవంలో ఉందని, ప్రస్తుతం తమ గ్రామానికి చెందిన మునిసిద్దప్ప కుమారులు కృష్ణప్ప, ధనశేఖర్ ఇరువురు సమాధిలో ఉన్న భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే లో ఈ వ్యక్తులు అక్రమంగా భూమి పత్రాలను తమ పేర్లపై మార్చుకుని, తన కుమార్తె పేరుపై రిజిస్టరు చేయించినట్టు తెలిపారు. తన భూమిని తనకు తెలియకుండా పత్రాలు మార్పు చేశారంటూ గతంలో కుప్పం తహశీల్దార్ కు వినతి పత్రం ద్వారా తెలిపానన్నాడు. మంగళవారం ఆక్రమణదారులు తమ భూమిని జెసిబి యంత్రాలతో చదును చేస్తుండగా తను అడ్డుకోవడానికి ప్రయత్నించినట్టు బాధితుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆక్రమణ దారులు తనపై దాడికి ప్రయత్నించారని, ప్రస్తుతం బెదిరింపులకు దిగి తన భూమిని అక్రమంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాలను కుప్పం ఎస్పై దృష్టికి తీసుకెళ్లానని పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కక్షసాధింపు వద్దు : వైసిపి

ప్రజాశక్తి- విజయపురం, నగరి : టీడీపీ అకృత్యాలు మితిమీరిపోతోందని, గ్రామాల్లో గుమ్మాలు కోట్టేయడం వారి కక్షసాధింపుకు పరాకాష్టగా నిలుస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. కక్షసాధింపులో భాగంగా మండలంలోని దామరపాకం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు గణపతిశెట్టి, లీలారామ్‌ల ఇంటిముందు ర్యాంప్ కూల్చేయడాన్ని బుధవారం మాజీ మంత్రి ఆర్కేరోజాతో పాటు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వైసిపి నేతలతో స్థానికులు కలగలుపుగా ఉండడాన్ని ఓర్వలేక టీడీపీ నేతలు స్థానిక ఎమ్మెల్యే మద్దదతుతో గడపను దుర్మార్గంగా కొట్టడం కక్షసాధింపుకు పరాకాష్ఠ అన్నారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు అంటే అభిమానం లేకపోవడం వల్లే సీఐలను, తహశీల్దార్లను, ఎంపీడీవోలను అడ్డం పెట్టుకొని ఇలాంటి దిగజారుడు చర్యలు చేస్తున్నారన్నారు. అధికార పార్టీ చెప్పినట్లు చేస్తే ఆధారాలతో ప్రైవేటు కేసులు వేస్తామని హెచ్చరించారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా కారిణులకు అభినందనలు

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : బిసిఎన్ విద్యా సంస్థలలోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో సైతం రాణించడం హర్షించదగ్గ విషయమని విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన తమ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని దివ్యశ్రీని, కుప్పం నర్సింగ్ కాలేజీ విద్యార్థిని మిన్ను జె ఫైన్ లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలకు సంబంధించి ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్స్ వాలిబాల్ క్రీడాకారుల ఎంపిక జరిగిందన్నారు. ఈ పోటీలలో మొత్తం 75 మంది పాల్గొనగా, అందులో తమ కళాశాల విద్యార్థిని దివ్యశ్రీ ఎంపిక అయినట్టు తెలిపారు. డాక్టరు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్స్ షటిల్ బాట్ మిట్టన్ క్రీడాకారిణుల ఎంపికలో కుప్పం నర్సింగ్ కళాశాల నందు బీఎస్సీ చదువుతున్న మిన్ను జె ఫైన్ ఎంపికైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ వైస్ చైర్మన్ డా. సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డా. సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. భాస్కరన్, ఫిజికల్ డైరెక్టర్ సి. సతీష్ కుమార్, పి ఆర్ ఓ ప్రవీణ్ కుమార్, విభాగాధిపతులు , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అభినందిస్తున్న బిసి నాగరాజు